సాక్షి
కాకినాడ

శనివారం । 6 । మే । 2023



అప్రమత్తత లేకుంటే ఆటపోట్లు


ప్రస్తుతం సెలవులు కావడంతో పిల్లలు వివిధ రకాల ఆటలు ఆడటానికి ఉత్సాహం చూపుతారు. ఈ క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. - IIలో▸



ఘనంగా సత్యదేవుని శ్రీచక్రస్నానం

దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం పంపా సరోవరంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల శ్రీచక్రస్నాన ఉత్సవం ఘనంగా నిర్వహించారు. - IIలో▸

శ్రీవారి రథయాత్ర రద్దు



ద్వారకా తిరుమల: శ్రీవారి వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి నిర్వహించాల్సిన రథోత్సవాన్ని ప్రతికూల వాతావరణం కారణంగా రద్దు చేశారు.

న్యూస్‌రీల్

సత్యదేవుని దర్శించిన 40 వేల మంది భక్తులు



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధి వైశాఖ పౌర్ణిమ పర్వదినం కావడంతో శుక్రవారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. సుమారు రెండు నెలల విరామం అనంతరం వివాహాలు జరుగుతుండడంతో పెద్ద సంఖ్యలో నవదంపతులు, మరో వైపు సత్యదేవుని దర్శనానికి విచ్చేసిన భక్తజనంతో ఆలయం కిక్కిరిసింది. సుమారు 40 వేల మంది సత్యదేవుని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పట్టింది. ఆలయప్రాంగణం, వ్రతమండపాలు, క్యూ లైన్లు అన్నీ భక్తులతో నిండిపోయాయి, భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. స్వామివారి వ్రతాలు 3,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

వికాసలో 8న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఈనెల 8న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె లచ్చారావు శుక్రవారం తెలిపారు. ఎన్‌ఇన్ సిస్టమ్ ఎన్‌ఐసీ కంపెనీలో యుఎస్ ఐటీ రిక్రూట్‌మెంట్, బెంచ్ సేల్స్ రిక్రూటర్, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్, ఓపీపీ రిక్రూటర్స్, జీకే గ్రూప్స్ లిమిటెడ్‌లో క్వాలిటీ కంట్రోల్, అకౌంట్స్ అండ్ కలెక్షన్, సేల్స్ అండ్ మార్కెటింగ్, ఎంకె స్కిన్ హాస్పిటల్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఫ్రెంట్ ఆఫీస్ కౌన్సిలర్, నిట్ (ఐసీఐసీఐ) బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ, హోండాయ్ మోబీస్‌లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం ఇవ్వనున్నారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.10 వేల నుంచి రూ.25 వేలు వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులందరూ 8వ తేదీ ఉదయం కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయం వద్ద సర్టిఫికెట్స్ జెరాక్స్‌లతో హాజరు కావచ్చని పీడీ వివరించారు.

ఉచిత పీయూసీ శిబిరం

అమలాపురం రూరల్: చమురు, సహజవాయుదు సంరక్షణ ఉత్సవాల్లో భాగంగా కామనగరువు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో శుక్రవారం ఉచిత కాలుష్య నివారణ శిబిరం నిర్వహించారు. గెయిల్ చీఫ్ మేనేజర్ కూరగంటి రాంబాబు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా రవాణా అధికారి అశోక్ ప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు గెయిల్ చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని కొనియాడారు. రాంబాబు మాట్లాడుతూ, కాలుష్యాన్ని తగ్గించేందుకు గెయిల్ ఆధ్వర్యాన ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కళాజాతాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇంధన పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా పలువురు వాహన చోదకులకు పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పీయూసీ) సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ వీరబాబు, తహసీల్దార్ పరమట శ్రీపల్లవి, పాఠశాల డైరెక్టర్ మను విహర్, గెయిల్ అధికారులు సుధీర్, రామకృష్ణ, డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో రూ.65.33 కోట్ల జమ



తేజ్ భరత్, జేసీ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): 2022–23 రబీ ధాన్యం సేకరణకు సంబంధించి కొనుగోలు చేసిన ధాన్యానికి ఇప్పటి వరకూ రూ.65.33 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్టు జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వరి సేకరణ 2.50 లక్షల మెట్రిక్ టన్నులు కాగా.. 20,419 మంది రైతుల నుంచి 1,43,058.559 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు కూపన్లు జనరేట్ చేశామన్నారు. శుక్రవారం వరకూ 12,392 రైతుల నుంచి 1,12,873.240 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలుపై ఏవైనా సందేహాలు, ఫిర్యాదులు ఉంటే కంట్రోల్ రూమ్‌ను 83094 87151, 0883 2940788 నంబర్లలో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు సంప్రదించవచ్చన్నారు.

మామిడిలో మారాజు



- కొత్తపల్లి కొబ్బరి మామిడికి సాటి ఏదీ
- వనంద్రైన పండూరు మామిడిదీ అదే తీరు
- కాలం మారినా ఎప్పటికీ ఇవి మధుర ఫలాలే..

పిఠాపురం: కొత్తపల్లి నుంచి కొత్త ఢిల్లీ వరకు మారుమోగిన పేరు కొత్తపల్లి కొబ్బరి మామిడి. మామిడి ప్రియుల మనసు దోచుకున్న ఒకే ఒక్క మధుర ఫలం ఇది. మామిడిలో ఎన్నో రకాలు ఉన్నప్పటికీ రాష్ట్రంలో గోదావరి జిల్లాల్లో మాత్రమే పండే కొత్తపల్లి కొబ్బరి, పండూరు మామిడిలకు ఉన్న ప్రాముఖ్యత మరే రకానికి ఉండదంటే అతిశయోక్తి కాదు. ఈ రెండింటినీ మామిడి ఉత్పత్తుల్లో (హిడెన్ జెమ్స్) దాచుకున్న రత్నాలు, వజ్రాలుగా భావిస్తారు. ఏగ్రామాల్లో వీటి ప్రాముఖ్యతను గుర్తించి సంరక్షించారో ఆయా గ్రామాల పేరున ఇవి ప్రసిద్ధి చెందాయని ఇక్కడి రైతులు చెబుతున్నారు. రాజుల కాలం నుంచి ఉత్తమ లక్షణాలున్న ఫలాలుగా గుర్తింపు పొందడంతో వీటికి ప్రాధాన్యత పెరిగింది. పూర్వం ఆంధ్ర ప్రాంతాన్ని పరిపాలించిన రాజులు తమ తోటల్లో వీటిని పెంచుకున్నారని తెలిసింది. తమ మిత్ర రాజులకు మామిడి పండ్లను కానుకలుగా పంపేవారు. రాజ సంస్థానాల్లో మాత్రమే ఉండే ఈ పళ్లను సాధారణ ప్రజానీకం కనీసం చూసే అవకాశం కూడా ఉండేది కాదని పలు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఇప్పటికీ ఈరకం మామిడి పండ్లను స్నేహితులకు, బంధువులకు, ప్రియతమ రాజకీయ నాయకులకు బహుమతిగా పంపించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

కొత్తపల్లి కొబ్బరి

కొబ్బరి తరహా పీచు అధికంగా ఉండడంతో పాటు మేలిమి బంగారు రంగులో కొత్తపల్లి కొబ్బరి మామిడి మెరిసిపోతుంది. నోరూరించేలా సువాసనలు వెదజల్లుతుంటుంది. పూదోటలో సువాసనల మాదిరిగా ఈమామిడి పండ్లు ఎక్కడ ఉంటే అక్కడ ప్రత్యేక సువాసనలు ఆస్వాదించవచ్చు. ఈ మామిడి పండులో ఫైబర్ అధికంగా ఉండడంతో పాటు కెరోటిన్, కాల్షియం, విటమిన్ ఏ, సీ ఎక్కువగా ఉంటాయి. తొక్క పలుచగా ఉంటుంది. పీచు చాలా ఎక్కువగా ఉంటుంది. పులుపు ఎక్కువగా ఉండడం వల్ల పచ్చి మామిడి మామూలుగా తినలేరు. పండు అయ్యాక రుచి అతి మధురంగా ఉంటుంది. ఈమామిడి కాయలు తక్కువ పరిమాణంలో ఉంటాయి. పండు చిన్నదే గాని ధరలో మాత్రం ఎక్కువగానే ఉంటుంది. కేవలం మామిడి సీజన్‌లో మాత్రమే పండుతాయి. పీచు ఎక్కువగా ఉండడం వల్ల పచ్చళ్లకు ఎక్కువగా ఉపయోగిస్తారు. ఆ మామిడితో పెట్టిన పచ్చళ్లు ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి. ఇవి తక్కువగా కాస్తాయి, గోదావరి జిల్లాల్లో ఎంతో ప్రసిద్ధి చెందిన మామిడి రకాల్లో దీనిదే ప్రథమ స్థానం.



కొత్తపల్లి కొబ్బరి మామిడి పళ్లు

పండూరు మామిడి

మామిడి రకాల్లో పండూరు మామిడి అత్యంత పురాతనమైన రకం. ఈచెట్టు వంద అడుగుల ఎత్తు వరకు ఎదుగుతుంది. చెట్టు నిండా కాయలు ఉంటాయి. చూడడానికి పప్పులో వేసుకునే చిన్న మామిడి కాయలుగా మాత్రమే ఉంటాయి. పండ్లు కూడా పచ్చగానే ఉండడం వీటి విశేషం. వీటి గురించి ఈ ప్రాంతంలో రకరకాలుగా చెబుతారు. గతంలో ఉంద్రాజవరం మండలంలోని వెలగదురు గ్రామ పరిసరాల్లో కొందరు దొంగలు మామిడి పండ్లను సంస్థానంలో దొంగిలించారని.. తిన్నాక టెంకలను కోట అవతల పారేశారని చెబుతారు. వాటిని తీసి నాటగా ఎదిగిన చెట్టు ద్వారా పండూరు రకం మామిడి పండ్లు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయనేది ఇక్కడ ప్రచారంలో ఉంది.



కొత్తపల్లిలో విరగకాసిన కొత్తపల్లి కొబ్బరి మామిడి చెట్టు

50 ఏళ్ల క్రితం ఒక్క చెట్టే ఉండేది



50 ఏళ్ల క్రితం కొత్తపల్లిలో ఒకే ఒక్క కొబ్బరిమామిడి చెట్టు ఉండేది. అప్పట్లో పండ్లు ముగ్గబెట్టడం తప్ప వేరే మార్గం లేదు. పండు అయ్యే వరకు చెట్టు నుంచి కోయకుండావదిలేసేవారు. దీంతో ఆచెట్టు పండ్లు తయారవ్వగానే చెట్టు చుట్టు పక్కల సువాసనలు వచ్చేవి. రుచి చూసిన వారు కొత్తపల్లిలో మాత్రమే దొరకడంతో పాటు కొబ్బరి లాంటి రుచి, పీచుతో ఉండడంతో కొత్తపల్లి కొబ్బరి మామిడిగా పేరొందింది. అప్పట్లో కొత్తపల్లికి చెందిన అప్పటి కాంగ్రెస్ నేత రావు అచ్చారావు ఈ పండ్లను పంపిస్తే నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తిని మెచ్చుకున్నారు. చెట్టు కొమ్మలకు అంట్లు కట్టి మొక్కలు తయారు చేయడంతో సంతతి పెరిగింది. ఇప్పుడు వివిధ రకాల హైబ్రీడ్ మొక్కలు అందుబాటులోకి వచ్చినా పూర్వం నుంచి ఉన్న విత్తనం ద్వారా వచ్చిన చెట్ల మామిడి పండ్లే అసలైన రుచిని కలిగి ఉంటాయి.

– కాకి శ్రీరాములు, రైతు, వాకతిప్ప.

మియా జాకీ కంటే మధురమైనది



విదేశాల్లో రూ.లక్షలు పలికే మియా జాకీ మామిడి పండ్ల కంటే మధురమైనది కొత్తపల్లి కొబ్బరి మామిడి. విదేశాల్లో ప్రయోగాత్మకంగా వాటి విలువను చాటి చెప్పడం వల్ల ఎక్కువ ధర ఉంటుంది. ఎక్కడో విదేశాల మామిడిని మనం గొప్పగా చెప్పుకుంటున్నాం. వాటి కంటే విలువైన పోషకాలున్న అతి మధుర ఫలాలు మన కొత్తపల్లి కొబ్బరి, పండూరు మామిడి రకాలు. వీటిని తలదన్నే మామిడి రకాలు ఎక్కడా లేవనే చెప్పాలి. ఇప్పటికీ ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రముఖులు ఈరెండు రకాల మామిడి పండ్లనే అడుగుతుంటారు. వీటిని శాస్త్రీయంగా మధుర ఫలంగా చాటుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– ఓదూరి నాగేశ్వరరావు, మామిడి రైతు, చేబ్రోలు.

ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



కానూరులో రైతులు, అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

పెరవలి: తడిసిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు రైతులకు భరోసా ఇచ్చారు. పెరవలి మండలం కానూరులో ఆయన శుక్రవారం పర్యటించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. రోడ్లు, రాశుల్లో, పొలాల్లో ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని మంత్రి సూచించారు. తేమ, ముక్క శాతం ఎక్కువగా ఉందని రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. మిల్లర్లకు రైతులు ఎలాంటి సొమ్ము చెల్లించనవసరం లేదని రైతులకు చెప్పారు. మిల్లర్లకు ఈ విషయంలో ఆదేశాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ ఇక్కడ ధాన్యాన్ని పరిశీలించారు. వ్యవసాయశాఖ జేడీ మాధవరావు, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ నాగార్జున రెడ్డి, ఆర్డీఓ మల్లిబాబు, తహసీల్దార్ రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ డీఎస్పీగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకారం



శ్రీనివాసులు

కంబాలచెరువు: సౌత్‌జోన్ డీఎస్పీగా కె.శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కందుకూరు సబ్ డివిజనల్ ఆఫీసర్‌గా పనిచేసి బదిలీపై రాజమహేంద్రవరం వచ్చారు. ఇప్పటివరకు సౌత్‌జోన్ డీఎస్పీగా పనిచేసిన ఎం.శ్రీలత కదిరి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులును పోలీసు సిబ్బంది కలిసి అభినందనలు తెలియజేశారు. ప్రథమంగా నేరాల అదుపు చేసే దిశగా కృషి చేస్తానని, నగరంలోని అసాంఘిక శక్తుల ఆట కట్టేందుకు వెనుకాడేది ఆయన తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- పథకాలను సద్వినియోగం చేసుకోండి
- లబ్ధిదారులకు ఎంపీ వంగా గీత పిలుపు

కాకినాడ సిటీ: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాల కింద పంపిణీ చేసిన ఆర్థిక సాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కృతికా శుక్లా, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తిలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడారు. దాంపత్య జీవితంలో ఒడిదొడుకులను అధిగమించి జీవితాంతం హాయిగా జీవించాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులకు గౌరవాన్ని, పుట్టిన పిల్లలకు స్ఫూర్తిని నింపేలా నడుచుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాల్లో చేరి ఆర్థిక సహాయంతో వ్యాపారాలు చేసుకుని సాధికారత దిశగా అడుగులు వేయాలని ఎంపీ సూచించారు. బాల్య వివాహాలను నివారించడం, పిల్లల చదువులను ప్రోత్సహించడం, పేద కుటుంబాల వధువుల తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకునేందుకు సీఎం జగన్ వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలను అమలు చేస్తున్నారని ఆమె అన్నారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విభిన్న ప్రతిభావంతులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లో ఆడపిల్లలకు వైఎస్సార్ కల్యాణమస్తు ద్వారా లబ్ధి కలుగుతోందన్నారు. జిల్లాకు సంబంధించి జనవరి–మార్చి, 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 508 మందికి రూ.3.61 కోట్లు మేర లబ్ధి జరుగుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష, కులాంతర వివాహానికి రూ. 1.2 లక్షలు, బీసీలకు రూ.50 వేలు, బీసీల్లో కులాంతర వివాహం చేసుకున్న వారికి రూ.75 వేలు, మైనార్టీలకు రూ.లక్ష చొప్పున లబ్ధి చేకూరుతుందన్నారు. కొత్త జంటలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. డీఎల్‌డీవో పి.నారాయణమూర్తి, డీఆర్‌డీఏ డీపీఎంలు వీవీ రాయ్, భరత్, ఎస్.వేదకుమారి తదితరులతో పాటు నూతన జంటలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు.



వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా మెగా చెక్కును అందజేస్తున్న ఎంపీ గీత, కలెక్టర్ కృతికా శుక్లా

మానవత్వం విలువలు చెప్పనిది మతమే కాదు

డాక్టర్ ఉమర్ ఆలీషా



సభలో మాట్లాడుతున్న ఉమర్ ఆలీషా

పిఠాపురం: ఏ మతమైతే మానవత్వం విలువల గురించి చెప్పదో అది మతమే కాదని శ్రీవిశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. స్థానిక పీఠం నూతన ఆశ్రమం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన వైశాఖ పౌర్ణమి సభలో ఆయన మాట్లాడారు. మానవ కల్యాణానికి దారి తీసేది త్రయూ సాధనే అన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఎక్కడ చూసినా ద్వేషం, పగ, అశాంతి, అసహనం, అసంతృప్తి, మారణ హోమం పెరిగిపోయి వినాశనం వైపు దారి తీస్తున్న దృష్టాంతాలు కనిపిస్తున్నాయన్నారు. భగవంతుడు ప్రసాదించిన పకృతిని మానవుడు నష్ట పరుస్తున్నాడన్నారు. కార్యక్రమంలో ఏవీవీ సత్యనారాయణ, ఎన్‌టీవీ ప్రసాద్, చింతపల్లి అమృత తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పొలాల్లో నీరు పంపే పనులు

కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: వర్షాల నేపథ్యంలో వరి పొలాల్లో నీరు నిలిచిపోకుండా డ్రెయిన్ల ద్వారా నీరు బయటకు వెళ్లిపోయేలా కాలువలను శుభ్రపర్చుతున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా వివరించారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియతో కలిసి రబీ కోతలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు, వరిపై వర్షాల ప్రభావం, ఉద్యాన పంటల పరిస్థితి తదితర అంశాలపై ఆమె సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద డ్రెయిన్ల ద్వారా నీరు పంపే పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియలో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం జరక్కూడదన్నారు. ఈ–క్రాప్ బుకింగ్, ఈ–కేవైసీ పూర్తి స్థాయిలో జరిగినందున వర్షాలు ఆగిన వెంటనే సమగ్ర సర్వే నిర్వహించి పంట నష్టాలను అంచనా వేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అర్హత మేరకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా అందేలా చర్యలు తీసుకోవాలని కృతికా శుక్లా స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్ విజయ్‌కుమార్, పౌరసరఫరాల డీఎం డి పుష్పమణి, జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



కరపలో ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

పది ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ

- నేటి ఉదయం 11గంటలకు విడుదల
- మూల్యాంకనమైన పదిరోజులకే ఫలితాలు
- జిల్లాలో పరీక్షలు రాసిన 29,988 మంది విద్యార్థులు

బాలాజీచెరువు(కాకినాడ సిటీ): విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పదవ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలను విడుదల చేయనుంది. విద్యార్థి దశలో ఎదుర్కొనే తొలి పబ్లిక్ పరీక్షల ఫలితాలు కావడంతో ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం ఉదయం 11 గంటలకు ఫలితాలు విడుదల చేయనున్నారు. గత విద్యా సంవత్సరంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో పరీక్షలు నిర్వహించగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో కొత్తగా ఏర్పడిన జిల్లాల వారీగా నిర్వహించారు. గతేడాది తూర్పుగోదావరి జిల్లా 65.83 శాతంతో రాష్ట్ర స్థాయిలో 4వ స్థానంలో నిలిచింది.

29,988 మంది విద్యార్థులు..

జిల్లాలో ఈ ఏడాది గతనెల 3 నుంచి 15వ తేదీ వరకు టెన్త్ పరీక్షలు జరిగాయి. 29,988 మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 136 పరీక్షా కేంద్రాల్లో 13,647 మంది బాలురు, 13,820 మంది బాలికలు పరీక్షలు రాశారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో పరీక్షా ఫలితాలను ప్రభుత్వం విడుదల చేస్తోంది. అమలాపురంలో గతనెల 19 నుంచి 26 వరకు పది జవాబు పత్రాల మూల్యాంకనం జరిగింది. గడువు లోపే మూల్యాంకనాన్ని పూర్తి చేశారు. మూల్యాంకనం పూర్తయిన పది రోజుల్లోనే ఫలితాలు విడుదల చేస్తుండడం గమనార్హం. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి అకడమిక్, పరీక్షల నిర్వహణలో ప్రతి దశలోను ప్రణాళికాబద్ధంగా వ్యవహరించిందనడానికి పది ఫలితాలే నిదర్శనంగా పలువురు పేర్కొంటున్నారు.



పది పరీక్షలు రాసిన విద్యార్థులు

పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాం



పరీక్షల నిర్వహణలో అన్ని దశలను సమర్థవంతంగా నిర్వహించాం. ఎక్కడా ఏ లోటు రాకుండా తొలి దశ నుంచి తుది దశ వరకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాం. మూల్యాంకనం కూడా నిర్ణీత గడువులో పూర్తి చేయగలిగాం.

– వి.రాజశేఖర్, ఏసీ, ప్రభుత్వ పరీక్షల విభాగం కాకినాడ.

సమర్థవంతంగా నిర్వహించాం



పది ఫలితాల్లో జిల్లా మెరుగైన ఫలితం సాధిస్తుందన్న నమ్మకం ఉంది. పరీక్షలకు ముందుగా పది విద్యార్థులకు 100 రోజుల ప్రణాళికను అమలు చేశాం. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. పరీక్షలను కూడా సమర్థవంతంగా నిర్వహించాం.

– కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, డీఈవో, కాకినాడ

31న తలుపులమ్మ ఆలయం పునఃప్రారంభం

తుని రూరల్: లోవ దేవస్థానంలోని తలుపులమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ, నూతన ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఈ నెల 31న నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లోవదేవస్థానంలో చైర్మన్ అచ్చియ్యనాయుడు అధ్యక్షతన శుక్రవారం ధర్మకర్తలు, వివిధ గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉత్తరాయణం పర్వదినాల్లో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రవేశానికి ముహూర్తం ఖరారు చేసినట్టు తెలిపారు. ఈ నెలలోనే ప్రతిష్ఠ, ప్రారంభోత్సవాలను నిర్వహించేందుకు ధర్మకర్తల మండలి తీర్మాణం చేసిందన్నారు. విగ్రహ ప్రతిష్ఠోత్సవాలను ఐదు రోజుల పాటు నిర్వహిస్తామని, ఒక్కొక్క రోజు ఒక్కొక్క గ్రామం నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. రూ.5 కోట్లతో అమ్మవారి ప్రధాన గర్భాలయాన్ని కృష్ణశిలతో పునర్నిర్మిస్తుండడంతో పాటు ఐదు అంతస్తుల మహామండపాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. దీంతో గత డిసెంబర్ నెల నుంచి ప్రధానాలయంలో అమ్మవారి దర్శనాలను నిలిపివేశారు. బాలాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని దర్శించేందుకు భక్తులను అనుమతించారు. విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవం చేసినప్పటికీ పూర్తిస్థాయిలో భక్తులకు అందుబాటులోకి రావడానికి మరో రెండు నెలలు సమయం పడుతుందన్నారు. లోవ మాజీ చైర్మన్ దూలం మాణిక్యం, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, రాజుపేట సర్పంచ్ బుద్దా సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు లంక కృపానందం, దుంగల నాగేశ్వరరావు, తమరాన శ్రీనివాసరావు, కిల్లాడ గోవిందు, ధర్మకర్తలు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



లోవ దేవస్థానంలో ధర్మకర్తలు, వివిధ గ్రామాల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న చైర్మన్ అచ్చియ్య నాయుడు, ఈఓ విశ్వనాథరాజు

క్లుప్తంగా

పశువుల పాకపై పిడుగుపాటు

- ఆవు, గేదె, 2 దూడలు దగ్ధం
- కన్నీటిపర్యంతమైన రైతు



పిడుగుపాటుకు బూడిదైన పశువుల పాకను పరిశీలిస్తున్న అధికారులు, ఎంపీపీ ప్రసాద్

పెరవలి: పిడుగు పడి, పశువుల పాక దగ్ధమవడంతో ఆవు, గేదె, ఆవు దూడ, గేదె దూడ కాలి బూడిదయ్యాయి. మండలంలోని ఖండవల్లిలో శుక్రవారం 12 గంటల ప్రాంతంలో ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పెద్ద శబ్దంతో పాకపై పిడుగు పడింది. పక్కనే ఉన్న రైతులు పరుగున వచ్చేసరికే పాకకు పూర్తిగా మంటలు వ్యాపించాయి. పశువులను బయటకు తీసుకువచ్చే అవకాశం కూడా లేకుండా పోయింది. అప్పటి వరకూ తాను అక్కడే ఉండి ఇంటికి భోజనానికి వెళ్లానని, అదే సమయంలో ఈ ఘోరం జరిగి, తన పశువులు మృత్యువాత పడ్డాయని గ్రామానికి చెందిన పాడి రైతు పిల్లి రామకృష్ణ కన్నీటి పర్యంతమయ్యాడు. మంటల్లో కాలిపోతున్న పశువులు ప్రాణభయంతో అరచిన అరుపులు అరణ్య రోదనగానే మిగిలిపోయాయని, తాము ఏమీ చేయలేకపోయామని, కళ్ల ముందే ఆ పశువులు కాలి బూడిదయ్యాయని చుట్టుపక్కల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలియడంతో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. రైతులతో మాట్లాడి అధికారులకు సమాచారం ఇచ్చారు. రెవెన్యూ, పశువైద్యాధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

అప్రమత్తత లేకుంటే ఆటపోట్లు

- క్రీడల్లో రక్షణ కవచాలు తప్పనిసరి
- లేకుంటే ఆటలకు శాశ్వతంగా దూరం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆరేళ్ల నుంచి 14 సంవత్సరాల లోపు బాలబాలికలు వివిధ రకాల ఆటలు ఆడటానికి ఉత్సాహం చూపుతారు. ఆసక్తి, అభిరుచి ఉన్న ఆటల్లో రాణించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని కలలు కంటారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో చేరేందుకు బాలబాలికలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆడాలనే ఉత్సాహం ఉన్నా.. ఆడే సమయంలో, శిక్షణ పొందేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. లేకుంటే ఆడే క్రమంలో గాయాలపాలై ఒక్కోసారి క్రీడలకు శాశ్వతంగా దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. ఆయా క్రీడల్లో శిక్షణ పొందేవారు, క్రీడాకారులు సంబంధిత పరికరాలు, దుస్తులు, బూట్లు, ఇతర రక్షణ పరికరాలు తప్పనిసరిగా వినియోగించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

క్రికెట్

క్రికెట్‌లో హెల్మెట్, గ్లౌజ్, ప్యాడ్స్, ఆర్మ్ గార్డ్, థైగార్డ్ వినియోగిస్తారు. ఎస్‌జీ, ఎస్ఎస్, బీడీఎస్, బీడీఎం, ఎంఆర్ఎం, జీఎం కంపెనీల బ్యాట్లు అందుబాటులో ఉన్నాయి. క్యాష్ట్ బ్యాట్ రూ.1,800 నుంచి రూ.3,500, ఇంగ్లిష్ బ్యాట్ రూ3,500 నుంచి రూ.60 వేలు, బాల్స్ రూ200 నుంచి రూ.250, మ్యాచ్ బాల్స్ రూ.450 నుంచి రూ.900, డ్రెస్ రూ.650 నుంచి రూ.3 వేలు, వికెట్లు, ప్యాడ్‌లు రూ.1,200 నుంచి రూ.1,500, కిట్‌బ్యాగ్ రూ.800 నుంచి రూ.15 వేలు, హెల్మెట్ రూ.1,100 నుంచి రూ.9 వేల వరకూ ఉన్నాయి.

ఫుట్‌బాల్

ఫుట్‌బాల్‌లో చిన్ గార్డ్స్, షూ వినియోగిస్తారు. బాల్స్ కాస్కో, నివ్య, విక్కీ, కాక్‌స్టన్, స్పాటన్ కంపెనీలవి ఉన్నాయి. బాల్స్ రూ.800 నుంచి రూ.2,500 వరకూ, నెట్స్ రూ.500 నుంచి రూ.15 వేల వరకూ, డ్రెస్ రూ.800 నుంచి రూ.1,500 వరకూ ఉన్నాయి.

> **నాణ్యమైనవి ఉపయోగించాలి**
>
> సాధ్యమైనంత వరకూ నాణ్యమైన క్రీడా పరికరాలనే వినియోగించాలి. నాసిరకం, డూప్లికేట్ కంపెనీ వస్తువులు కొంటే మూన్నాళ్లకే మూలకు చేరడం ఖాయం. తాజాగా తయారు చేసిన క్రీడా పరికరాలు మాత్రమే వాడాలి. క్రికెట్, షటిల్, టెన్నిస్ బ్యాట్‌లు కొనుగోలు చేసినప్పుడు హ్యాండిల్స్, పగుళ్లు, ఫ్రేమ్ క్రాక్స్ లేకుండా చూసుకోవాలి. నాణ్యమైన గెట్ ఉన్న బ్యాట్లు కొనుగోలు చేయాలి. కొన్న వస్తువులకు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. ఆయా కంపెనీలను బట్టి స్పోర్ట్స్ షూ ధరలు రూ.600 నుంచి రూ.10 వేల వరకూ పలుకుతున్నాయి.

బాస్కెట్‌బాల్

టీషర్ట్, షార్ట్, షూ వినియోగిస్తారు. కాస్కో, నివ్య, విక్కీ కంపెనీల బాల్స్ ధర రూ.750 నుంచి రూ.2,500 వరకూ ఉంది. డ్రెస్ రూ.900 నుంచి రూ.3 వేలు, షూ రూ.1,500 నుంచి రూ.8 వేలు, నెట్ రూ.400 నుంచి రూ.5 వేల వరకూ ఉన్నాయి.

వాలీబాల్

ఈ క్రీడలో ముఖ్యంగా షూ వినియోగిస్తారు. కాస్కో, నివ్య, విక్కీ కాక్‌స్టన్, స్పాటన్ కంపెనీల బాల్స్ రూ.600 నుంచి రూ.1800 వరకూ రేటు పలుకుతున్నాయి. నెట్ రూ.400 నుంచి రూ.5 వేల వరకూ, డ్రెస్ రూ.800 నుంచి రూ.8 వేల వరకూ ఉన్నాయి.

హాకీ

హెల్మెట్, చెస్ట్‌ప్యాడ్, బాడీ ప్రొటెక్షన్, గ్లౌజ్, ప్యాడ్, నీగార్డ్స్, ఎల్‌బోగార్డ్స్ వంటి రక్షణ పరికరాలు వినియోగిస్తారు. రషక్, ఆల్ఫా, ప్యాంటా, హ్యాంపెయిర్ కంపెనీల హాకీ స్టిక్స్ రూ.650 నుంచి రూ.5 వేల వరకూ, నెట్ రూ.25 వేలు, గోల్‌కీపర్ కిట్ రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకూ ఉన్నాయి.



వివిధ రకాల క్రీడా పరికరాలు



క్రీడా పరికరాలు కొనుగోలు చేస్తున్న బాలిక



స్విమ్మింగ్ డ్రెస్, గాగుల్స్, క్యాప్

బ్యాడ్మింటన్

రిస్ట్‌బ్యాండ్లు, సీక్యాప్స్, షూ, టీషర్ట్, షార్ట్స్ వినియోగిస్తారు. ఫెదర్ కాక్స్ కొరత కారణంగా ఎక్కువ కాలం మన్నిక కోసం నైలాన్ కాక్స్ ఉపయోగిస్తున్నారు. యోనెక్స్, నివ్య, కాస్కో, కామాచి, లీనింగ్, యాష్‌వే, కాల్టన్ కంపెనీల బ్యాట్లు రూ.650 నుంచి రూ.15 వేల వరకూ, నెట్‌లు రూ.350 నుంచి రూ.3 వేల వరకూ, కాక్స్ బ్యారర్ రూ.300 నుంచి రూ.4 వేల వరకూ అమ్ముతున్నారు.

హ్యాండ్‌బాల్

హ్యాండ్‌బాల్‌లో టీషర్ట్, షార్ట్, షూ వినియోగిస్తారు. కాస్కో, నివ్య, విక్కీ బాల్స్ రూ.700 నుంచి రూ.5 వేల వరకూ, నెట్‌లు రూ.1,000 నుంచి రూ.2 వేల వరకూ ఉన్నాయి.

టేబుల్ టెన్నిస్

బటర్‌ఫ్లై, స్టాగ్, సైగ, జేకే, కంగ్‌ఫూ, కాస్కో టీటీ బ్యాట్లు రూ.400 నుంచి రూ.5 వేల వరకూ, బాల్స్ రూ.30 నుంచి రూ.250 వరకూ అమ్ముతున్నారు. స్టిగా, స్టాగ్, కాక్‌స్టన్ టీటీ బోర్డులు రూ.25 వేల నుంచి రూ.80 వేల వరకూ దొరుకుతున్నాయి.

స్కేటింగ్

స్కేట్స్, హెడ్‌గార్డ్, ఎల్‌బో గార్డ్, నీగార్డ్స్, షూ, స్కేటింగ్ డ్రెస్ వినియోగిస్తారు. స్కేటింగ్ షూ రూ.400 నుంచి రూ.10 వేలు, డ్రెస్ రూ.500 నుంచి రూ.5 వేలు, ప్రొటెక్షన్ కిట్ రూ.400 నుంచి రూ.4 వేల వరకూ ఉన్నాయి.

స్విమ్మింగ్

క్యాప్స్, గాగుల్స్, ఇయర్ ప్లగ్స్, డ్రెస్ వినియోగిస్తారు. స్విమ్ సూట్స్ రూ.100 నుంచి రూ.2 వేల వరకూ, గాగుల్స్ రూ.150 నుంచి రూ.5 వేల వరకూ, షార్ట్స్ రూ.250 నుంచి రూ.2 వేల వరకూ విక్రయిస్తున్నారు.

అమ్మకాలు బాగున్నాయి



పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో క్రీడా పరికరాల కొనుగోళ్లు బాగా జరుగుతున్నాయి. నాణ్యమైన, మంచి కంపెనీకి చెందిన పరికరాలు కొనుగోలు చేస్తే ఎక్కువ కాలం మన్నుతాయి.

– టి.హరీష్, హరీష్ స్పోర్ట్స్

రక్షణ పరికరాలు ప్రధానం



ఆటలు ఆడుకునేటప్పుడు గాయాల బారిన పడకుండా ఉండాలంటే రక్షణ పరికరాలు వినియోగించడం తప్పనిసరి. ముఖ్యంగా బాక్సింగ్, హాకీ, క్రికెట్, స్కేటింగ్ వంటి క్రీడల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. సాధ్యమైనంత వరకూ మంచి కంపెనీల క్రీడా పరికరాలనే కొనుగోలు చేయాలి.

– శ్రీనివాస్ కుమార్, చీఫ్ కోచ్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ

పెళ్లి వేడుక నుంచి వెళ్తూ.. తిరిగిరాని లోకాలకు..

- పంట బోదెలోకి దూసుకుపోయిన మోటార్ సైకిల్
- యువకుడి మృతి
- మృతుడు కాకినాడ పోర్టులో క్వాలిటీ మేనేజర్



రాజేంద్ర ప్రసాద్ (పాతచిత్రం)

అల్లవరం/అంబాజీపేట: వివాహ వేడుకలో పాల్గొని తిరిగి వెళ్తున్న ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయాడు. స్థానికుల కథనం ప్రకారం.. అంబాజీపేట మండలం ఇసుకపూడి శివారు దాసరివారి పేటకు చెందిన పమ్మి రాజేంద్ర ప్రసాద్ (35) కాకినాడ పోర్టు ఎగుమతులు, దిగుమతుల విభాగంలో క్వాలిటీ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి రాజోలు సమీపంలోని తాటిపాకలో జరిగిన బంధువుల వివాహ వేడుకలో పాల్గొన్నాడు. శుక్రవారం మొదటి షిఫ్టులో అతడు విధులకు హాజరు కావాల్సి ఉంది. దీనికి ఆలస్యం కాకుండా ఉండాలనే ఉద్దేశంతో వివాహం అయిన వెంటనే రాజేంద్ర ప్రసాద్ తాటిపాక నుంచి కాకినాడకు మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. తెల్లవారుజామున బోడసకుర్రు బ్రిడ్జి దాటిన తర్వాత చర్చి ఎదురుగా అతడి మోటార్ సైకిల్ అదుపు తప్పి, జాతీయ రహదారి పక్కనే ఉన్న పంట బోదెలోకి దూసుకుపోయింది. తీవ్రంగా గాయపడిన రాజేంద్ర ప్రసాద్ వెంటనే తేరుకుని, బోదెలో నుంచి పైకి వచ్చాడు. కొన్ని క్షణాల వ్యవధిలోనే మృతి చెందాడు. అతడు నిద్ర మత్తులో లేదా వాహనానికి ఏదైనా అడ్డం రావడంతో ప్రమాదానికి గురై ఉంటాడని భావిస్తున్నారు. ఘటనా స్థలం వద్ద సిమెంట్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టడం అతడి మృతికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్‌కు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని, ఇంతలోనే మృత్యువాత పడ్డాడని బంధువులు రోదించారు. అతడి మృతితో దాసరివారిపేటలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఇంటికి పెద్ద కొడుకు అయిన రాజేంద్ర ప్రసాద్ అందరితో కలివిడిగా, కుటుంబానికి ఆసరాగా ఉండేవాడని బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. వివాహ వేడుకల్లో అందరితో సరదాగా గడిపాడని బంధువులు విలపించారు. సంఘటన స్థలాన్ని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సందర్శించి, మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాజేంద్ర ప్రసాద్ మృతికి సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్ బాబూరావు, ఎంపీటీసీ సభ్యుడు ముత్తాబత్తుల ప్రశాంత్, ఏఎంసీ డైరెక్టర్ కోట విజయరాజు తదితరులు సంతాపం తెలిపారు. ప్రమాదంపై అమలాపురం ఎస్సై డి.ప్రభాకర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటన స్థలంలో ఎమ్మెల్యే చిట్టిబాబు తదితరులు

ఘనంగా సత్యదేవుని శ్రీచక్రస్నానం

- వేడుకగా నాగవల్లి, దండియాడింపు
- నేడు సత్యదేవుని శ్రీపుష్పయాగం

అన్నవరం: వార్షిక దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శుక్రవారం పంపా సరోవరంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల శ్రీచక్రస్నాన ఉత్సవం వైభవంగా నిర్వహించారు. పెళ్లి పెద్దలు సీతారాములు వెంట రాగా, నవదంపతులైన సత్యదేవుడు, అమ్మవార్లను, ఉదయం 8.30 గంటలకు పంపా తీరానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడి కల్యాణ మండపంలో సింహాసనంపై స్వామి, అమ్మవార్లను వేంచేయించి, పూజలు చేశారు. పండితుల మంత్రోచ్చారణల నడుమ పంచామృతాలతో స్వామి వారికి, శూలానికి అవభృథ స్నానం చేయించారు. అనంతరం సత్యదేవుని ఉత్సవ మూర్తిని, శూలాన్ని పంపా సరోవరం వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లి మూడుసార్లు చక్రస్నానం చేయించారు. దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్, అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట శ్రీనివాస్, అర్చకులు, పురోహితులు శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. స్వామివారితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు కూడా పంపా జలాల్లో పుణ్యస్నానం ఆచరించారు. ఏర్పాట్లను సూపరింటెండెంట్ వెంకట రమణ పర్యవేక్షించారు.

సాయంత్రం రత్నగిరిపై అనివేటి మండపంలో స్వామి, అమ్మవార్లకు నాగవల్లి పట్టు, నీలలోహిత ధారణ, దండియాడింపు కార్యక్రమాలను పండితులు ఘనంగా నిర్వహించారు. సత్యదేవుడు, అమ్మవార్లను ప్రత్యేక వేదిక మీద, సీతారాములను మరో ఆసనం మీద వేంచేయించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రంగులతో నాగవల్లి తీర్చిదిద్ది, దానికి నాలుగు వైపులా 32 జ్యోతులు వెలిగించి, పూజలు చేసి, అమ్మవారికి నీలలోహిత ధారణ చేశారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణం నాడు ఆరోహించిన ధ్వజాన్ని అవరోహణ చేశారు. తదనంతరం అర్చక స్వాములు బంతులాట, బిందెలో ఉంగరం వెతకడం వంటివి వేడుకగా చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల విగ్రహాలు పట్టుకుని అర్చకులు దత్తు శర్మ, పవన్ తదితరులు నృత్యం చేస్తుండగా వీరిపై మిగిలిన అర్చకులు రంగులు జల్లుతూ సందడి చేశారు. సత్యదేవుని ప్రధానాలయంలోని సత్యదేవుడు, అమ్మవార్ల మూలవిరాట్టుకు, రామాలయంలోని సీతారాముల విగ్రహాలపై కూడా రంగులు జల్లారు. సిబ్బంది కూడా పరస్పరం రంగులు జల్లుకుంటూ ఆనందంతో పరవశించారు.

నేటితో కల్యాణోత్సవాల ముగింపు

దివ్యకల్యాణ మహోత్సవాల చివరి రోజైన శనివారం రాత్రి సత్యదేవుడు, అమ్మవార్ల శ్రీపుష్పయాగోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఈసారి స్వామివారి కల్యాణం నిర్వహించిన వార్షిక కల్యాణ మండపంలోనే శ్రీపుష్పయాగం ఘనంగా నిర్వహించనున్నామని ఈఓ తెలిపారు. రాత్రి 8.30 నుంచి 10 గంటల వరకూ ఈ కార్యక్రమం జరుగుతుంది. కల్యాణ మండపం ముందున్న విశ్రాంతి మండపం, దాని వెలుపల సుమారు 6 వేల మంది భక్తులు ఈ ఉత్సవం తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదాలతో పాటు మహిళలకు రవికెల వస్త్రం పంపిణీ చేస్తారు. ఈ సందర్భంగా వార్షిక కల్యాణ మండపాన్ని సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. రాజేష్ గురుకుల్ బృందానికి చెందిన అలంకరణ సిబ్బంది రవి, మారుతీరామ్, మల్లికార్జున్, రాజశేఖర్ తదితరులు స్వామి, అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు.



సత్యదేవుని చక్రస్నాన ఉత్సవంలో పండితులు, ఈఓ అజాద్, ఏసీ రమేష్‌బాబు



స్వామి, అమ్మవార్లకు అవభృథ స్నానం నిర్వహిస్తున్న పండితులు



నాగవల్లి పట్టు, దండియాడింపు నిర్వహిస్తున్న పండితులు

భార్య, ప్రియుడే హంతకులు

- హత్య కేసులో వీడిన మిస్టరీ
- నాలుగు రోజుల్లో ఛేదించిన పోలీసులు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్సై చైతన్యకుమార్

అంబాజీపేట: భర్తను భార్య, ఆమె ప్రియుడు కలిసి హత్య చేసిన ఉదంతమిది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పి.గన్నవరం సీఐ డి.ప్రశాంతకుమార్ శుక్రవారం విలేకర్లకు ఈ విషయం తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. మండలంలోని గంగలకుర్రు అగ్రహారానికి చెందిన రాయుడు రవిశంకర్ తల్లి ఆదిలాబాద్‌లో ఉపాధ్యాయురాలిగా పని చేసేది. ఆ సమయంలో మృతుడు గజానంద్ బోడ్కర్ ఆమె కారు డ్రైవర్‌గా పని చేశాడు. కరోనాకు ముందు మసాలా వ్యాపారం నిర్వహించిన రవిశంకర్.. అది గిట్టుబాటు కాకపోవడంతో స్వగ్రామం గంగలకుర్రు అగ్రహారం వచ్చేశాడు. స్థానికంగా వర్మి కంపోస్ట్ యూనిట్ ఏర్పాటు చేశాడు. తనకు సహకరించేందుకు గజానంద్ బోడ్కర్, ఊర్మిళ దంపతులను ఆదిలాబాద్ నుంచి రప్పించి, అమలాపురం మండలం బండారులంక మెట్ల కాలనీలో నివాసం ఏర్పాటు చేశాడు. వర్మి కంపోస్ట్ యూనిట్‌లో కూడా నష్టాలు రావడంతో రవిశంకర్.. రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటారు సైకిళ్ల విడిభాగాల వ్యాపారం చేశాడు. ఈ క్రమంలో ఊర్మిళకు రవిశంకర్‌కు మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. దీనికి అడ్డం వస్తున్నాడనే కక్షతో ఊర్మిళ భర్త గజానంద్‌ను గత ఏడాది నవంబర్ 23న పథకం ప్రకారం వర్మి కంపోస్ట్ షెడ్డులో కొట్టి చంపేసి, మృతదేహాన్ని అక్కడే పాతిపెట్టారు. ఇదిలా ఉండగా గంగలకుర్రు అగ్రహారం వెళ్లిన తన కుమారుడు కనిపించడం లేదంటూ గజానంద్ తండ్రి శివాజీ గత జనవరిలో హైదరాబాద్ అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు కోసం అక్కడి పోలీసులు అంబాజీపేట వచ్చారు. నాలుగు రోజుల క్రితం ఈ కేసును అఫ్జల్‌గంజ్ నుంచి అంబాజీపేట పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. వెంటనే ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ కె.వెంకట రమణ పర్యవేక్షణలో సీఐ డి.ప్రశాంత్ కుమార్, ఎస్సై ఎ.చైతన్యకుమార్ ఈ కేసు దర్యాప్తు చేపట్టారు. సీఐ, ఎస్సైలు శుక్రవారం సంఘటన స్థలాన్ని సందర్శించారు. అనుమానం రావడంతో వర్మి కంపోస్ట్ యూనిట్ వద్ద తవ్వించారు. అక్కడ పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో గజానంద్ అస్థిపంజరం లభించింది. ఊర్మిళ, ఆమె ప్రియుడు రవిశంకర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.